



**మూపర్నెంటు** కావ్యకంఠం కొద్ది రోజుల కిందటే రిటైరయ్యాడు. భార్య పుట్టింటికెళ్ళింది. అందుచేత ఒంటరిగా ఇంట్లో ఉంటూంటే తన కేమీ తోచని కారణంగా, ఇంకా సర్వీసులోనే ఉన్న తన మిత్రుడు భూషణాన్ని ఒక ఆదివారం నాడు తనింటికి భోజనానికిపిలిచాడు. అతను వచ్చాడు.

భోజనాలయిన తరవాత తాంబూల చర్వణం అవుతూండగా సన్నగా తన భవిష్య త్కార్యక్రమం గురించి భూషణానికి చెప్పాడు కావ్యకంఠం. పెళ్ళయిపోయి తన కూతురూ, ఉద్యోగంలో చేరి తన కొడుకూ సెటిల్ అయిపోయారు కనకా, కొడుకు పెళ్ళి కొడుకే చూసుకునేట్టున్నాడు కనకా, తన కొక సొంత ఇల్లు అనేది ఏర్పడింది కనకా, ఇక చీకూ చింతా లేకుండా కాలం గడపచ్చని తా ననుకుంటున్నాననీ, అయితే ఒంట్లో ఓపికా బుర్రలో తెలివీ ఇంకా పని చేస్తూండడం చేత ఒక వ్యాపకం అంటూ లేకుండా ఉండటం కష్టం కనక తనకు రచనా వ్యాసంగంలో పడాలనుందనీ, పేరు తెచ్చుకోవాలనికూడా ఉందనీ అన్నాడు.

కుర్చీలో కాలు మీద కాలేసుకుని కూర్చుని, తాంబూలం నములుతూనే చిరునవ్వు నవ్వాడు భూషణం. దాన్ని ప్రోత్సాహంగా తీసుకుని మరి కొంచెం ముందుకు వెళ్ళాడు కావ్యకంఠం.

"అసలు మా నాన్న నాకు చిన్నప్పుడు నాలుగు సంస్కృతం ముక్కలూ, నాలుగు తెలుగు కావ్యం ముక్కలూబుర్రలోకెక్కించాడయ్యా.నేనొకమహాకవి నయిపోవాలని ఆయన ఆశ. అందుకనే నాకు పేరు కూడా కావ్యకంఠం అని పెట్టాడు. అప్పట్నుంచీ నాకూ రాద్దామనే ఉంది కానీ, ఏదీ తీరుబాటు? దొరికితేనా! ముందర పలకలు పగల గొట్టటం, ఆ తరవాత పాళీలు విరగ్గొట్టడం, పరీక్షల్లో తప్పటం, ఆ తరవాత ఉద్యోగం రాక, ట్రాన్స్ఫర్లూ, ప్రమోషన్లూ, పెళ్ళి చెయ్యటం, నేను రిటైర్మెన్నా! జబ్బు సత్తువ చావలేదు సరికదా, పుష్కలంగా తీరుబాటొప్పి పడిం దిప్పుడు. ఇక చూడు, కథ మీద కథా, నవల మీద నవలా, వ్యాసం మీద వ్యాసం, గ్రంథం మీద గ్రంథం పరపరా రాసి పారేయాలనిపిస్తుం దోయ్, భూషణం . . . ఏమంటావ్?"

భూషణం అన్నాడు: "ఏమంటాను—ఆ వేడి చల్లారి పోకముందే రాసేయమంటాను."

"హర్డిల్ సలహా అంటే— నన్నిం కెవ్వ రావగల రంటావ్?"

"ఎవరికి పని—ఎవరాపుతారు! నీ రాతే చిన్న ఆపాలి గాని.,."

కావ్యకంఠం నిశితంగా చూశాడు: "నా రాతా... అంటే?"

భూషణం కళ్ళు చికిలించి చిలిపిగా నవ్వాడు. "రాసి రాసి అలసిపోయి నువ్వు విశ్రాంతి తీసుకోవూ? అదీ...ఇంతకీ ఏమయినా రాశావా?"

కావ్యకంఠం ఆమాంతం అందలం ఎక్కేశాడు. మహానందంతో పడక్కుర్చీలోంచి లేచి చటుక్కున నడిచి టేబుల్ కిందున్న పెట్టె తీశాడు: "రాయుట మేంటయ్యా! రాయుటం, పంపటం, అది పడి

పోవటం అన్నీ ఏక కాలమందే జరిగి పోతేనూ! చూడు.''

భూషణం వీక్లీ అందుకున్నాడు. చదివాడు. అన్నాడు: '''దిక్కుమాలిన కథా?' ఇదేం పేరయ్యా, కంఠం! రాయుక రాయుక శుభమా అని శ్రీకారం చుట్టుతూ 'దిక్కుమాలినకథ'తో మొదలు పెట్టావా? ఈ ఎడిటర్ మహాశయు డెవ్వరో అనామక రచయితల్ని ఉద్ధరించేవాడనుకుంటాను, టప్పనవేసేసుకున్నాడు!''

''నువ్వు ముందు కెళ్ళి చదవవయ్యా, తరవాత విమర్శిద్దువు గాని!'' ముఖం ముడుచుకుంటూ అన్నాడు కావ్యకంఠం.

''ఇంకేం చదవనయ్యా పేరుతోనే మతి పోతేనూ! ప్రపంచం గురించో రేప్ గురించో ఆత్మహత్య గురించో ఇట్లా ఏదో దరిద్రం గురించి రాస్తుంటావు. చదివే దేమిటి, రోజూ మన చుట్టూ చూడటంలా ఈ కొచ్చుంతా?'' భూషణం వీక్లీని వెనక్కి మడిచేసి టీపాయ్ మీద పెట్టబోయాడు. కావ్యకంఠం చటుక్కున తన చెయ్యి చాపి మిత్రుణ్ణి అడ్డుకున్నాడు.

''అన్నన్నా, అప్పుడే పెట్టెయ్యకు. పోనీ ఒక పేజీ చదువు. ఆ తరవాత అదే విన్ను లాక్కెళ్ళక పోతే న్నడుగు!''

విధి లేనట్టు మొహం పెట్టి పుస్తకం చేతో పట్టుకునే భూషణం అన్నాడు: ''పోనీ, టూకీగా ప్లాట్ చెప్పు. బాగుంటే చదువుతాను.''

''సస్పెన్స్ పోతుందే! ఆల్‌రైట్, చెబుతున్నాన్లే నీ గ్రాబట్టి. ఆ తరవాత మాత్రం కథ చదవాలి సుమా! అసలు రచయిత అన్నవాడు ప్రజల్లోకి దూసుకు వెళ్ళి పోవాలి. సమకాలీనంగా ప్రజల కుండే ఆనందాలూ, అనుభూతులూ, కష్టాలూ, దుఃఖాలూ, వ్యథలూ, కన్నీళ్ళూ వాటి పరిష్కారాలూ వీటన్నింటినీ స్పృశిస్తూ రాయాలి. చెకోవ్ మాక్స్, మొపాసా లాంటి వాళ్ళు అట్లా రాసే పాపులర్ అయ్యారు. అందుచేత నేనుకూడా అట్లాగే రాసి పాపులర్ అవుదామనుకుంటున్నాను. సరే, ఇప్పుడు మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న దేమిటో చెప్పు!''

''లక్షున్నాయి, ఏదని చెప్పను?''

''వరకట్నమయ్యా, వరకట్నం! దాన్ని రూపు మాపకపోతే ఎటువంటి అనర్థాలు సంభవిస్తాయో గొంతెత్తి అరిచి చెప్పాను ఈ కథలో!''

భూషణం మొహంలో విసుగు తొంగి చూసింది. అయినా సర్దుకుని అన్నాడు: ''కదేమిటో చెప్పమంటే...''

కావ్యకంఠం లేచాడు. అటూ ఇటూ పచార్లు చేస్తూ హుషారుగా చెప్పటం మొదలు పెట్టాడు: ''ఒక తెలుగింటి మిడిల్ క్లాస్ తండ్రి. అతను ఆదర్శవాది కనక తన కొడుక్కు కట్నం పుచ్చుకోలేదు. కానీ కూతురుకు ఇవ్వక తప్పలేదు. అందుకోసం పొలం అమ్ముకున్నాడు. కానీ వియ్యంకుడూ, అల్లుడూ డబ్బు మనుషులు. 'స్కూటర్ ఇస్తేనే పండక్కొస్తాం' అని రాశాడు అల్లుడు. నగలమ్మి స్కూటరు కొనిచ్చాడు ఇతగాడు. ఆ తర్వాత క్రమంలో వాషింగ్ మెషిను, ఫ్రిజ్, ఐవసీన్ టూ—ఇన్—వన్, మిక్సర్, క్వార్ట్జ్ వాచీ వగైరా వగైరా— ఇవన్నీ అల్లుడు సంపాదించాడు ఒక్కొక్క పండక్కి ఒక్కొక్కటి చొప్పున! మిగిలి ఉన్న నగలు, ప్రావిడెంటు ఫండు, గ్రాట్యుయిటీ, చివరికి సొంత ఇల్లు—ఇవన్నీ పోగొట్టు కున్నాడు కన్యాదాత, ఏడాది కొక్కటి లెక్కన! ఆఖరుగా కన్యాదాతగారు అల్లుడికి ఉత్తరం ఒకటి రాసి పడేశాడు: 'అమ్మాయిని పంపించేస్తా, పంపించేస్తా అని బెదిరిస్తూ వచ్చావు ఇంతకాలంగా. ఇప్పు డిక నా భార్య తప్ప వాదంటూ నా కేమీ లేదు. మేము పూర్తిగా సన్యాసులమై పోయాము. కాషాయ రంగు బట్టలు కట్టుకుంటున్నాము. ఇప్పుడు పంపించుకో ఎక్కడికి పంపించుకుంటావో నీ పెళ్ళాన్ని! మే మిద్దరం ఎటో పోతున్నాం!' అని...''

కావ్యకంఠం ఆపాడు. ఆగాడు, భూషణం మొహంలోకి చూస్తూ అన్నాడు: ''ఎట్లా ఉంది?''

విరక్తిగా భూషణం అన్నాడు: ''ఏమిటో, అదో రకంగా ఉంది.''

అతని భుజం మీద కొట్టి, హుషారుగా పెళ్ళున నవ్వుతూ అన్నాడు కావ్యకంఠం. ''ఉందా?... ఇంకా ఉంటుంది చూడు... అసలు ట్విస్టంతా ముందే ఉంది? ఏం. ఆ తర్వాత ఆ


...ఇప్పుడు, మీ దుస్తులు మిరుమిట్లు గొలిపేలా వుతుక్కోండి—స్పార్క్‌తో దీనిని సాధించండి.

స్పార్క్. అతి తక్కువ వ్యయంలో మీ దుస్తుల వుతికే సమస్యను నివారించగల కుటుంబ డిటర్జెంట్ బార్. స్పార్క్‌తో వుతికిన దుస్తులు స్వచ్ఛందమైన తెల్లదనంతోను, ప్రకాశవంతముగాను శోభిల్లగలవు....సూర్యకాంతివలే ప్రకాశించుతూ వుండగలవు.





స్పార్క్

ప్రభుత్వ సంస్థయొక్క ఒక విశిష్టమైన తయారీ.

కేరళ స్టేట్ డిటర్జెంట్స్ & కెమికల్స్ లిమిటెడ్, కుట్టిపురం 679 571.

FDS KSDC 3693 TEL




కన్యాదాత భార్యతో సహా వెళ్ళిపోయి శ్రీశైలంలో కన్యాసుల మఠంలో చేరాడు. అక్కడ తన కష్ట గాథనంతా ఒక పాటగా రాశాడు. ఇక భార్యతో సహా తంబురా మీటుకుంటూ శ్రీశైలం గుడి గుమ్మంలో కూర్చుని భక్తులకు నీతి బోధ చేయటం మొదలు పెట్టాడు. ఆ సారాంశం ఏమిటంటే—'భక్తులారా! తొందరగా ముక్తి పొందాలంటే ఒకే ఒక తేలిక మార్గం, వాలాగా ఒక ఆడపిల్లకి పెళ్ళి చెయ్యండి. ఆ తర్వాత మీరే వచ్చి మోక్ష మార్గంలో నాతో కలుస్తారు. అసలు ఒకర్ని కనండి చాలు. అది ఆడపిల్ల అయితే మంచిది. మళ్ళీ ఇద్దరైతే ముక్తి ఆలస్యం సుమా! అసలు సంతానమే లేక పోతే మరీ మంచిది. మీ రిక్కడికి ఎట్లాగూ వస్తారు' ఇది. . ." కావ్యకంఠం ఆగాడు. అన్నాడు—

"ఇక్కడ నేను సంతానం ఆ పలౌర్ని, ఉన్నా ఒక్కరు చాలు అన్నాను గదా— అంటే కుటుంబ సంక్షేమాన్ని ప్రచారం చేసినట్లే గదా! ఈ విధంగా గవర్నమెంటుకు సహకరిస్తున్నాను గదా— ఉత్తరోత్తరా నాకు రేడియోలోను, టి. వి. లోను ఛాన్సులు రావంటావా?"

భూషణం వీక్లీని టీపాయ్ మీదికి విసిరేశాడు. ఆవులించాడు. కళ్ళు మూసుకున్నాడు. నీరసంగా అన్నాడు: "వస్తయ్, వస్తయ్. తప్పకుండా వస్తయ్."

పచార్లు చేస్తూ హుషారుగా మళ్ళీ అందుకున్నాడు కావ్యకంఠం—

"ఏం? ఆమట్న ఒక రోజున ఏమయిందంటే, పిల్లల కోసం తపించి పోతున్న ఆ కూతురూ, అల్లుడూ ఎర్.టి.సి. మీద కాశ్మీరెళ్ళి వస్తూ శ్రీశైలంలో దిగారు. గుడిముందు పాటవిన్నారు. 'ఈ పాటేదో కొత్తగా ఉందే' అనుకుంటూ ఆ సన్యాసి దంపతుల్ని తేరిపార చూశారు. గుర్తు పట్టేశారు. ఇంకేముంది! ముందు ఆశ్చర్యం, ఆ తర్వాత గోల. ఆ పిల్ల ఒకందుకు ఏడిస్తే, ఈ అల్లుడు ఇంకొకందుకు ఏడుస్తున్నాడు. ఏమిటో తెలుసా? ఆ అల్లుడికి ఒక చెల్లెలు ఉంది. ఆ పిల్ల అత్తింటి వాళ్ళు మంచి వాళ్ళే. కానీ, తండ్రే మరీ డబ్బు మనిషి కదా! పెళ్ళినాడు బకాయి పెట్టిన సగం కట్నం యాభై వేలు చస్తే ఇవ్వనన్నాడు. 'అయితే చస్తున్నా' నంది అక్కడే చచ్చిం ఉరేసుకుని. పైగా పుట్టింటి అవమానాన్ని ఏ పడతీ సహించదనీ, సాక్షాత్తూ పార్వతీదేవే పుట్టింట్లో హోమ కుండంలో పడి ఆత్మాహుతి చేసుకోగా, తా ననగా ఎంతనీ ఉత్తరం ఒకటి రాసిపెట్టి మరీ చచ్చింది. ఆ ఉత్తరం పెద్ద గొడవకు దారి తీసింది. ఆ పిల్ల మొగుడు కోర్టు కెళ్ళటం, ఆ పిల్ల నగలు తనవే అనటం వగైరా వగైరా. ఆ పాటలోకి ఈ కథ ఎక్కటంతో తన చెల్లెలి కథ రచ్చ కెక్కుతున్నందుకు ఆ అల్లుడికి అరికాలి మంట నెత్తి కెక్కింది. ఆపాటాన ఆ అల్లుడు తన సన్యాసి అత్త మామల్నిద్దర్నీ తన కారుకి తీసుకెళ్ళి ఎడా మడాల్సి. . ."

భూషణం కనుబొమ్మలు ముడి పడ్డాయి. ఆమోఘయంగా చూశాడు. హఠాత్తుగా అన్నాడు: "ఆగాగు. ఇదేదో నా కుటుంబ గాథ లాగా ఉంది. మా ముద ఎప్పుడది కూడా ఇట్లాగే వచ్చింది కదా!"

"చ చ, నీ కథా! భలేవాడివి... ఏం? ఆ తర్వాత. . ."

"ఆగాగు. నన్నే మాటు కథ చదవనీ!"

భూషణం వీక్లీ అందుకొని కథని పైకి చదవటం మొదలు పెట్టాడు. కావ్యకంఠం పడకుర్చీలో వెనక్కానుకొని కాలుమీద కాలూపుకుంటూ అర మూత కళ్ళతో ఆనందంగా వింటున్నాడు. భూషణం కొంత చదివాడు. శ్రీశైలం ఆలయ ద్వారంలో పాట పూర్తయ్యే సరికి అతనికి మళ్ళీ కనుబొమ్మలు ముడుపడ్డాయి. చూపు తీక్షణమయింది. మొహం క్రమంగా ఎర్రబడింది. చటుక్కున పుస్తకాన్ని కింద పడేశాడు. తలెత్తి కోపంగా అన్నాడు:

"ఏమయ్యా, కావ్యకంఠం! ఏదో కలిసి ఒకే ఆఫీసులో పని చేశాం కనకా, నువ్వేదో మంచి వాడివని నమ్మాను కనక నీతో ఇంతకాలం స్నేహం చేశాను. కష్టాల్లో నీతో మనసిప్పి చెప్పుకున్నాను. ఉండి ఉండీ నా ఇంటి కథ పత్రికెక్కిస్తావా! నువ్వింత కృతఘ్నుడవనుకోలేదు. ఇదేం బాగుందయ్యా నీకు!"

కావ్యకంఠం బిత్తరపోయాడు. అతను కూడా లేచి నుంచున్నాడు. "ఇదేంటయ్యా! నేనేదో కథ రాసుకుంటే నీ కదేనంటావేమిటి? పుట్టింట్లో ఆత్మహత్య చేసుకున్న కూతురున్నదంటే అది నీ కూతురే అనీ, ఆ తండ్రివి నువ్వే అనీ దాఖలా ఏంటయ్యా? భలేవాడివే. కూర్చో, కూర్చో."

"దాఖలా ఏంటా? పేరు—పేరయ్యా! నీ కథలో ఆ తండ్రి పాత్రకు పన్నాగభూషణం అని పెట్టావు. నా పేరుతో సహా నా కుటుంబ గాథని బజారు కీడ్చి అందరూ మర్చిపోయిందాన్ని జ్ఞాపకం చేశావు. నన్ను పదిమందీ ఇంకోసారి చెప్పులెత్తి కొట్టేట్టు చేశావు!"

కంగారుగా కావ్యకంఠం అన్నాడు: "నే నసలు పన్నా, నాగభూషణం అని రాసి పంపాను అంటే లావుపాటి నాగభూషణం అని. అచ్చు తప్పు పడి పన్నాగభూషణం అయింది. అయినా వారం వారం కొన్ని వందల కథలు అచ్చవుతున్నాయి. మరి ప్రతి ఉద్యోగీ—'ఈ లంచం కథ నాదే' అనీ, ప్రతి ఆడదీ 'ఈ రేప్ కథ నా గురించి' అనీ అల్లరి చేసుకుంటున్నారా?. . అయినా అప్త మిత్రుడివి నీ కథ రాస్తానా! నాకేం లాభిస్తుందో చెప్పు!"

"అదిగో మళ్ళీ అదే మాట! చచ్చిపోతూ నా కూతురు రాసి పెట్టిన ఉత్తరంలో మాటలన్నీ యాజిటీజాగా కథలో దింపేశావు. నా అల్లుడు మా అమ్మాయి డిగ్రీ సర్టిఫికెట్టును నా కివ్వననటం లాంటి చిన్న విషయాన్ని కూడా వదిలిపెట్టలేదు. ఇందులో నాది కాని దేముంది? ఇది ఖచ్చితంగా నా కథే! నీతో కలిసి జాయింటుగా చింతపండు వ్యాపారం చేద్దామని ఇంతకాలంగా అనుకుంటూ వచ్చాను. చేసే ఉంటే ఎన్ని రూట్లలో నన్ను ముంచేసే వాడివో తలుచుకుంటే గుండె ఆగిపోతూంది. నీ అసలు రంగు ఈ విధంగా బయట పడింది. ఇంకా నయం, పెందరాలే మేలుకొన్నాను! నువ్వు. . . నువ్వు... నీచుడివి! ఛీ! నీ మొహం ఇంక నేను చూడను, నువ్వు నాకు చూపకు! పో!" భూషణం కోపం కక్కుతూ విసవిసా వెళ్ళిపోయాడు.

తెల్లబోయి, అవాక్కయిపోయి చూస్తూ నిలబడి పోయాడు కావ్యకంఠం.


మతి మతిలో లేని స్థితిలో రెండు రోజులు ఎట్లాగో గడిపాడు.

• • • •

మూడోనాడు మధ్యాహ్నం ఇంట్లోకి దిగింది కావ్యకంఠం కూతురు శైవలిని. దిగుతూనే తండ్రి దగ్గర కొచ్చి కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంది. కావ్యకంఠం కంగారు పడ్డాడు. "ఏమమ్మా! మీ ఇంట్లో అంతా కులాసాయేనా? మీ ఆయనా, నీ పిల్లాడూ ఆరోగ్యంగా ఉన్నారా?. . ఉత్తరం పత్రం లేకుండా ఇంత హఠాత్తుగా దిగావేమిటే?"

అత నడగటం ఇంకా పూర్తి కానేలేదు. దగ్గుత్తికతో శైవలిని అంది: "క్షేమం అడుగుతున్నావా, నాన్నా! ఎందుకులే! ఏదో పెంచి, పెద్దచేసి, పెళ్ళిచేసి








మంచి కుటుంబంలోకి పంపావుకదా అని నేనూ, నన్ను చూసుకుని మా వారూ ఏ పొరపొచ్చాలూ లేకుండా ఇంతకాలమూ గడిపాం. లేక లేక పుట్టిన చంటాణ్ణి చూసుకుని మురిసిపోతున్నాం. ఇంత కాలమూ నా అంత అదృష్టవంతురాలు లేదని గర్వపడ్డాను. ఇంతలో ఇంతయి పోతుందని కల్లో కూడా అనుకోలేదు. హు. హు హు. . ''— సన్నగా ఏడుపు మొదలు పెట్టింది శైవలిని.

అయోమయంగా చూశాడు కావ్యకంఠం. ''ఏమి టమ్మా! ఏమయింది? మీ అత్తమామ లేమయినా అన్నారా? మీ ఆయనకూ, నీకూ ఏ విషయంలో చెడింది? అతను మంచి సంస్కారవంతుడేనే!''

''సంస్కారవంతులు కాబట్టే పుస్తెల్తో రాని చ్చారు. మాటీ పోటీ మాటల్తో బాధపెట్టకుండా స్పష్టంగా తేల్చి చెప్పేశారు. ఇంకోళ్ళయితే నా గతి ఏమయ్యేదో! హు... హు...''

కావ్యకంఠం కుర్చీ ముందుకు లాక్కున్నాడు. కూతురు తలమీద చెయ్యేసి నిమిరాడు. ''ఒక్క ముక్క అర్థమయి చావలేదు. విషయం మేమిటో స్పష్టంగా చెప్పు, తల్లీ!''

శైవలిని ఏడుపు దిగమింగి కోపంగా చూసింది తండ్రివైపు. ''అర్థమవ్వలేదూ?. . ఏ మర్థ మవ్వాలి! ఆ దిక్కుమాలిన 'దిక్కుమాలిన కథ' నువ్వు ఎందుకు రాసినట్టు? ఎవర్ని ఉద్ధరించినట్టు— నా కాపరంలో నిప్పులు పొయ్యటానిక్కాదూ?. . . మా వారికి నువ్వు స్కూటరే కాకుండా, వాషింగ్ మెషినూ, ఫ్రిజా, గీజర్సూ వెత్తా చేదారం కొని చ్చావా? ఇచ్చిందే ఒక్క స్కూటరే! అదయినా ఫస్ట్ హాండ్ ది కాదే! దాన్నయినా అడిగింది నేను! కట్నం ను వ్వెంతిస్తే అంత సంతోషంగా పుచ్చుకున్నారుకదా ఆ మహారాజు! ఈ మాత్రానికి నువ్వు టికారివ్వై పోయావా? మేము నీ కే మపకారం చేశామని మమ్మ ల్నిట్టా వీధిని పడేశావు? వారిని పరమ దుర్మార్గు లుగా చిత్రించావు! చెప్పు...చెప్పు, నాన్నా ముందర.'' తండ్రి కళ్ళలోకి కళ్ళు పెట్టిచూస్తూ నిగ్గదీస్తు న్నట్టుగా అడిగింది శైవలిని.

కావ్యకంఠం బ్రహ్మస్పడి పోయాడు. శూన్యంలోకి చూస్తూ నుంచున్నాడు. శైవలిని వదల్లేదు. తనూ నుంచుంది—''చెప్పు, నాన్నా, చెప్పు!''

''ఏం చెప్పనే?''

''మా వారిని అంత క్రూరంగా ఎందుకు చిత్రిం చావో చెప్పు!''

'అది మీ కథ కాదు. నే నేదో తోచక నాలుగు ముక్కలు రాసుకున్నాను. కథ అన్న తరవాత అనేక పాత్ర లుంటాయి. లోకంలో ఎన్నో చూస్తూ ఉంటాము. ఎన్నో అనుభవా లవుతాయి. అవి మెదడులో జ్ఞాపకం పొరల్లో నిలిచి పోతాయి. పెన్ను అందుకో గానే కాగితం మీదికి ఎప్పుడు, ఏది ప్రవహిస్తుందో ఎవరూ చెప్పలేరు. అయినా, అప్పు డీ కథలో పాత్రలు మీవేనని గారంటీ ఏమిటి?''

''ఏమిటో! అల్లుడు అరడుగుల వా డన్నావు. వంకీల జుట్టు, దబ్బపండు రంగు, కండకు గల గండలు ఉన్నాయన్నావు. ఇది సరిగ్గా మా వారి వర్ణనే. క్రికెట్టూ, టెన్నిసూ, హాకీ, గోల్ఫూ—

ఇట్లా సవాలక్ష ఆటలుండగా నీ కథలో అల్లుడికి చెడుగుడు, చదరంగం వచ్చన్నావు. మేమిద్దరం అప్పుడప్పుడు చైనీస్ చెక్కర్స్ ఆడుకుంటామని నీకు తెలుసు. అది చదరంగం బోర్డుకు వెనక వైపు ఉండే ఆట. కథలో వాళ్ళిద్దరూ చిలకా గోరింకల్లా ఉన్నారన్నావు. మా అత్తగారు పెట్టిన ఎర్రంచు చిలక పచ్చ పట్టు చీర నేనూ, బూడిద రంగు సూటు మా వారూ వేసుకుని మా ఇంటికి వచ్చినప్పుడు మమ్మల్నిద్దర్నీ నువ్వు సరిగ్గా ఇవే మాట అన్నావు జ్ఞాపకముందా? వచ్చేవారం మేం శ్రీశైలం వెళ్ళబోతున్నామని రెణ్ణెల్ల క్రితం నీకు రాశాను. ఇది కూడా కథలో కెక్కింది. ఇన్ని దాఖలాలుండగా నన్నెట్లా మభ్య పెట్టగలవ్? మా వారిని గురించి చేతనైనంత చండాలంగా ఆంధ్రదేశమంతా ప్రచారం చేసేశావ్! వారు నన్ను పొమ్మన్నారు. వచ్చేశాను. వచ్చేశాను, నాన్నా, వచ్చేశాను. నువ్వింత దురాత్ముడవనుకోలేదు. నాన్నా, అనుకోలేదు!'' శైవలిని కన్నీటి ప్రవాహాన్ని తుడుచుకుంది. గొంతు బాగా బొంగురు పోయింది.

నూతిలోంచి వస్తున్నట్టున్న స్వరంతో కావ్యకంఠం నెమ్మదిగా అన్నాడు: ''ఇప్పుడొస్తున్న కథల్లోనూ, నవలల్లోనూ ఉండే హీరోనే నేనూ తీసుకున్నానే, తల్లీ! ఆ వర్ణనే నేనూ చేశాను. అది మీ ఆయనకు సరిపోవటం నీ కర్మ! సుఖంగా కాపురం చేసుకుంటున్న ఏ కుర్రకారు దంపతులైనా చిలకా గోరింకల్లాగా ఉన్నారనటం కవి సమయం. అనగా కవి సహజం. అది నీకు సరిపోవటం ఇంకో కర్మ. అయినా, నా కథలో అల్లుడు పెళ్ళాన్నిట్లా పుట్టింటికి తోసేసినట్లు రాయలేదే! మరి దాని కేమిటంటావు?''

శైవలిని సివంగి లాగా లేచింది. కళ్ళు పెద్దవి చేస్తూ చేతులు తిప్పుతూ అంది: ''అదుగదుగో—అక్కడే నువ్వు దొరక ననుకున్నావ్. నీ కథలో సన్యాసి వేషాల్లో ఉన్న తల్లి తండ్రుల్ని వదలి రాని కూతురు మొరాయిస్తే అల్లుడు కనికరించి వాళ్ళని పోషించటానికి ఇష్టపడి తనతోపాటు డిప్పకాయల పాడు తీసుకెళ్ళాడని నువ్వు ముగించావు. కాని ఇది అసందర్భంమాట. ఎందుకంటావా? సుత్తుల్లాగానూ, డిబ్బరొట్టెల్లాగానూ ఉన్న అత్త మామల్ని వంట మనుషులుగా ఇంట్లో పెట్టుకుని పోషించేటంత ఉదారుడైన అల్లు డెవడూ ముందుస్తుగా వాళ్ళని పిల్చి పిప్పి చేసి బికారుల్ని చెయ్యడు. కాని, అసలు నువ్వు నీ కథలో ఆ అల్లుడు విసిగెత్తిపోయి తన భార్యకు కూడా కాషాయ వస్త్రాలు కొనిపెట్టాడనీ, ఆ అమ్మాయిని ఆ సన్యాసి అత్త మామల దగ్గరే వదిలేసి లేచి చక్కా పోయాడనీ రాయాలని ముందస్తుగా అనుకున్నావు. మావారు నన్నిట్లా నీ దగ్గరికి పంపేస్తారని నీకు తెలుసు. అయినా బొత్తిగా తెలిసి పోతుందని అట్లా ముగించావు. మేము తెలుసుకోలే మనుకున్నావు...అవునా?''

చిరాగ్గా కావ్యకంఠం అన్నాడు: ''ఇదెక్కడి గోలే! నే నేదో రాసుకుంటే అది నీదే నంటావేమే! నీకు లేకపోతే పోయింది బుద్ధి — అతని కేమయిందే?''


''నాన్నా! నన్ను లక్ష అను— పడతాను. వారిని ఒక్కటన్నా నే నొప్పుకోను!''

''సరే, ఇంతకీ అత నేమంటాడు? ని న్నెందుకు పొమ్మన్నట్టు?''

''ఎందుకా? నువ్వా కథ వారిని గురించి రాయ లేదని వారిని నువ్వు ఒప్పించాలట. ఆ విషయం అందరికీ నువ్వే చెప్పాలట. నీకు చెప్పమన్నారు. ఇది తేలేదాకా నన్ను తన గుమ్మం ఎక్కవద్దన్నారు. నువ్వేదయినా ఇంకా అల్లరి చెయ్యదలుచుకుంటే నాకు విడాకు లివ్వటానికి కూడా వెనకాడనని చెప్పమన్నారు.''

''ఒహో! అంతదాకా వెళ్ళిందీ వ్యవహారం! అయితే అనుభవించు— కర్మ!''

''కర్మనాది కాదు నాన్నా,నీది! కథ రాసి కూతురు కాపురం కూల్చేశాడన్న పేరు తెచ్చుకుని సుఖంగా ఎట్లా బతుకుతావో నేనూ చూస్తాను. ఇంటింటికి వెళ్ళి నీ గురించి ప్రచారం చేస్తాను. అయినా నాకు..




నాకు.. ఎనిమిదేళ్ళ కాపరంతోనే వసంతం మరుగైపోయిందా? ఇరవైల్లోనే అరవై వచ్చేసిందా? నా బతుకేం గాను? పుట్టిన వూరి శ్మశానానికే నేను అంకితం కాబోలో దేవుడో!'' శైవలిని వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది.

''ఛీ ఛీ వెధవగోల! బుద్ధి లేకపోతే సరి!'' చిరాగ్గా కావ్యకంఠం లేచి చొక్కా తొడుక్కుని వీధిలోకి బయలుదేరాడు.

● ● ● ●

ఇంకో రెండు రోజులు గడిచాయి. కావ్యకంఠం ఒక్కగానొక్క కొడుకు శుద్ధకీర్తి పెరిగిన గడ్డంతో, మాసిన బట్టలతో, సూట్‌కేసు వూపుకుంటూ ఏభయి లంఖణాల ఏబ్రాసి లాగా దిగాడు. అతన్ని చూసిన కావ్యకంఠానికి మతి పోయింది.

''ఈ వాలకమేంటి, ఈ రావడమేంటి? కిందటి సారొచ్చినప్పుడు ఈ ఏటి కింక సెలవు ల్లేవన్నావు. ఇప్పు డేం సెలవు దొరికిందని?''

సంచానే తలొంచుకునే విచారంగా అన్నాడు శుద్ధకీర్తి—''సెలవులేగా, నాన్నా, నీ క్కావలసింది! చాలా పెద్ద సెలవే దొరికింది. ఇదిగో—కాగితం మీదే ఇచ్చారు.''

కావ్యకంఠం కాగితం అందుకున్నాడు. కానీ, ''కళ్ళజోడు లోపలుంది. విషయ మేమిటో చెప్పు'' అన్నాడు.

''నన్ను వూస్టు చేశారు. పొమ్మన్నారు. వచ్చేశాను.''

''ఎందుకు వూస్టు చేశారు? బాంకు డబ్బు పోగొట్టావా?''

''అట్లాంటిది జరిగినా బాగుండును కట్టేద్దును. ఇట్లా జరగటం అన్యాయం! పాడిగోవు లాంటి ఉద్యోగం నా పాపం ఏం లేకుండా ఫటేమని పేలిపోయింది!''

''పేలటం ఏమిట్రా...సరిగ్గా ఏడూ!''

శుద్ధకీర్తి చటుక్కున కుర్చీలో కూర్చుని సూట్‌కేసులోంచి వీక్లీని తీశాడు. పేజీలు తిప్పాడు. తండ్రికి చూపిస్తూ అన్నాడు: ''వూళ్ళ పేర్లూ వర్ణనల్నీ బట్టీ, కారెక్టర్స్ వర్ణనల్నిబట్టీ ఈ కథ రాసింది నువ్వేనని మా బాంక్ డైరెక్టర్ నిశ్చయానికి కొచ్చేశాడు. నన్ను పిలిచి—'అవునా?'' అని అడిగాడు. 'అయ్యుండొచ్చు' అన్నాను. 'నువ్వు వెళ్ళొచ్చు' అన్నాడు ఇట్లా కథ రాయటం నీకేం బాగుంది, నాన్నా? నా భవిష్యత్తంతా బూడిద చేసేశావే!''

''నా కథకు, నీ ఉద్యోగానికి సంబంధ మేమిటెటా! అడగలేదా?''

''నువ్వు నీ ఆస్తంతా అమ్ముకుని కాషాయోలో శ్రీశైలం వెళ్ళబోతున్నట్లు రాసుకున్నావు కదా— అదీ లింకు!''

''రాసుకుంటే?''

''సరిగ్గా ఇదే నేనూ అడిగా న్నాన్నా! ఆయన— మీ నాన్నతో నాకు పాతికేళ్ళ పరిచయం ఉంది.

ఆయన దగ్గర బంగారమూ, వెండీ ఉన్నాయని నాకు తెలుసు. ఇప్పు డీ విధంగా కథ ద్వారా తన ఆస్తి అంతా అమ్ముకొన్నట్లు చెప్పాడూ అంటే ఆ సంపదలో చిల్లికానీ కూడా నీకివ్వ దలుచుకో లేదని చెప్పినట్లన్న మాట! ఇట్లా ఇవ్వననటం నీ ఉద్యోగం విషయంలో బ్రీచ్ ఆఫ్ ష్యూరిటీ అవుతుంది. అయినా సరే, నిన్ను ఉద్యోగంలోఉంచు కుందామంటే బాంకును మోసగించినవాడి కొడుకు వుగా నిన్ను మా కస్టమర్స్ అసహ్యించుకుంటారూ' అని అన్నాడు, నాన్నా?''

''నువ్వేం చెప్పావు?''

''నే నన్నానూ—ఆ బంగారమూ, వెండీ ఏనాడో కరిగిపోయాయండీ. ఆస్తి కూడా నిజంగానే కొంత కరిగిపోయింది. మీ కిచ్చిన ష్యూరిటీ ఇల్లేనూ! అది నిజంగా ఇంకా అమ్మలేదు, సార్!' అని. దాని కాయన, ఇంకో లా పాయింటు తీసి, 'అంటే మీ




నాయన కొన్ని అమ్ముకోవటం నిజమన్న మాటేగదా! అంటే ఆయన స్టెప్ బై స్టెప్ బికారి అవుతున్నా డన్న మాట! మరి మా అమ్మాయిని నీకిచ్చి చేద్దామను కున్నానుగదా— ఎట్లా?' అన్నాడు. నేను 'పర్వాలేదు, చేసెయ్యబడి, సార్!' అన్నాను. చటు క్కున ఆయన 'షటప్' అనబోయాడో, అన్నాడో నాకు జ్ఞాపకం లేదు కానీ, 'ఒక బికారి కిచ్చి పెళ్ళి చేసి,నా కూతుర్ని కూడా బికారిని చేసుకోమంటావా? నాన్సెన్స్! అస ల్నీ కిక్కడ ఉద్యోగమే లేదు. ఇంకా నయం—పెందరాళే చెప్పావు! పో, ఇది పుచ్చుకుని వెళ్ళిపో!' అని మాత్రం అన్నాడు, నాన్నా!''

కావ్యకంఠం తల పట్టు క్కూర్చున్నాడు. అతనికి నషాళం అంటుతోంది. ఉండి ఉండిలేస్తూ ''నే నాయనతో ఫోన్లో మాట్లాడతా నాగు'' అన్నాడు.

''ఆయన లేడు, నాన్నా, హైదరాబాదు వెళ్ళాడు. కో—ఆపరేటివ్ బాంక్ డైరక్టర్ల కాన్ఫ రెన్సుట. నెలాఖరిగ్గాని రాడట.''

''ఖర్మ'' అంటూ నుదుటి మీద కొట్టు కున్నాడు తండ్రి.

''అంతా నాదే నంటావా, నాన్నా?'' అన్నాడు కొడుకు.

''షటప్! లోపలికి అఘోరించి కూడు కుడు!'' అరిచాడు తండ్రి.

● ● ●

''హవ్వ, హవ్వ! ఇదెక్కడి గోలండీ! తల రాతలు చాలవనా పెన్నురాతలంట!'' అప్పుడే రైలు దిగొచ్చిన శాంకరి భర్తను చూస్తూనే అందుకుంది.

''ఏమిటి నువ్వనేది?'' కావ్యకంఠం అన్నాడు.

''ఏమిటా? నే నొకటి అనటం, అనకపోవటం అంటూ ఉండేడిసిందాఏమిటి? అనవలసినవీ అనకూడ నివీ అన్నీ మీరు రాసిపారేశాక! అయినా, నాకు తెలి యక అడుగుతాను—మీరూ, నేనూ కాషాయాలు కట్టుకు కున్నామా? శ్రీశైలం వెళ్ళి బైరాగుల్లో కలసిపోయామా? నాకేం కర్మండీ బైరాగుల్లో కలసిపోవటానికి? నా రెండెకరాలూ నా కుంది. పోతే మీరు ఫాండి.. సరేనమ్మా.. ఆ సర్దనేంటంటూ మీ సిగముడి విప్పి, చిక్కుదీసి, పేలు చంపి, మళ్ళీ ముడేసి పూలతో అలంకరించానా! తంబుర నేను మీటుతూ మీ వెనకాల వస్తూంటే, ఆ పాటేదో నా బొంద పాట— పాడుతూ మీరు మెట్లెక్కు తూంటారా! చివరికి మీ రిట్లా దిగజారిపోయి, నన్ను దిగజార్చేస్తారా! నా గతి ఇట్లా కాలి పోయిందా! నా రాత!!''

''ఇదుగో—నువ్వూరికే రంకె లెయ్యకు. నేను రాసిందంతా నిజమే ననుకోవటానికి నీకు పిచ్చెక్క లేదుకద! అసలు నిన్నా కథను ఎవరు చదవ మన్నారు?''

''నేను చదివానుటండీ! మా చెల్లెళ్ళూ, వాళ్ళ పిల్లలూ చదివారు. చుట్టు పక్కల వాళ్ళు చదివారు. పేరంటానికి వచ్చినట్టొచ్చి మీటింగు పెట్టి మరీ చదివారు. 'శాంకరమ్మ సన్యాసుల్లో కలిసిపోతోందర్రో' అని ఒకటే కాకిగోల! తలెత్తు కుని నడిస్తినా, నిద్రపోయి ఏడిస్తినా, తిండితిని చస్తినా! అసలు బయటికి కదిలితే ఒట్టు!''

నవ్వుతూ అన్నాడు కావ్యకంఠం. ''అయితే నా కథలో అంత వాస్తవికత ఉందన్న మాట! అది అంత వాడి కథ అన్న మాట! బేష్! నే నొక రచయితనైనట్టే లెక్క!''

కోపం కక్కుతూ శాంకరి అంది: ''వాడి కాదు, అది పాడు కథ! నా పిండా కూడు కథ! వాడి కథట, వాడి కథ! జన్మ ఎత్తగానే సరా! సార్థక తుండొద్దూ! లక్షన్నర జీవాలు పాట్లన్న పుడు తున్నాయి, రాత్రిగ్గిడుతున్నాయి. వాటి కన్న మనం ఏం ఎక్కువంట? వెధవ బతుకు!... ఛీ, ఛీ'' కావ్య కంఠం మొహం మీద మెటికలు విరుస్తూ ఇంట్లోకి వెళ్ళబోయింది.

లోపల్నుంచి కూతురూ, కొడుకూ ఆముదం తాగిన మొహాల్తో ఎదురొచ్చారు, ''ఏమిటే ఇట్లా వచ్చారూ, కూడబలుక్కొన్నట్లుగా!... మీ ఆయన కూడా వచ్చేడేమిటే?'' అంది శాంకరి.

శైవలిని అంది: ''రాలేదమ్మా! ఇక రారు. నాన్న మా గురించే కదా కథ రాసింది. అందుకని నన్ను పొమ్మని మీ అల్లుడుగారు తరిమేశారు.''

''మరి నీ విషయం ఏమిట్రా? నీ ఉద్యోగంలో ఏమయినా?...''

''అవునమ్మా—వూడిపోయింది.''

''అయిందీ!'' శాంకరి గడ్డం మీద వేలేసు కుంది. ''సర్వమంగళం అయిందన్న మాట! ఈ కథ అందరి గురించీ నన్న మాట! అయితే...ఏమండోయ్! ఇక ఆలస్యం దేనికి? వెళ్ళి పట్టండి కాషాయాలు. మంచిరకం తంబురాకూడాను. మీరు రాసుకొన్నట్టే బయల్దేరదాం. కాస్త కనికరం చూపించి మూడో నంబరు బట్టలు పట్టుకొస్తే ధన్యులం. ఇరవై నంబరువి పట్టుకొచ్చినా దిక్కులేదనుకో!... పదం డర్రా పదండి, లోపలికి. బయల్దేరేటప్పుడు ఆయనే పిలుస్తార్లే!'' శాంకరి పిల్లల్తో లోపలి కెళ్ళిపోయింది.

కావ్యకంఠం తల పట్టుకుని కళ్ళు మూసుకుని నిర్జీవంగా కుర్చీలో పడుకొనుండి పోయాడు.

● ● ● ●

''నమస్తే, సార్.''

''హలో, సెక్రటరీగారా! నమస్తే, రండి.''

సెక్రటరీ వచ్చి కూర్చున్నాడు. ''మీరు రిటైర్ అయిన సందర్భంగా మీకు ఆఫీసులో పార్టీ ఏర్పాటు చెయ్యబోతున్నామని నేను చెప్పాను, కిందటి వారం. కానీ... క్షమించాలి — ఏర్పాటు చెయ్యలేక పోతున్నాము.''

కావ్యకంఠం కనుబొమ్మలు ముడిచాడు. ఏం మాట్లాడ్లేకపోయాడు. కొన్ని క్షణాల తరవాత అన్నాడు: ''నే నసలు కోరుకోలేదు... అయినా... కారణం తెలుసుకోవచ్చా?''

సెక్రటరీ కావ్యకంఠం కళ్ళలోకి చూశాడు. చూసి చూసి తల దించుకొని అన్నాడు: ''మీరూ,

మేమూ ఎంతో అన్యోన్యంగా ఉంటూ వచ్చాము. మీ సౌహార్ద్రతను, సవితనాన్ని చూసి మీరు ఈ వూరు వచ్చినప్పట్నుంచీ మీకు ట్రాన్స్‌ఫర్లు రాకుండా మాలో కొంతమందిమి చూస్తూ వచ్చాము. మీరు ఇల్లు కట్టుకొంటున్నప్పుడు, మీ అమ్మాయి పెళ్ళికి డబ్బు సర్దుబాటు చెయ్యటంలోను, ఇతరత్రాను మీకు మేముచేదోడువాదోడుగా ఉన్నాము అట్లాంటి మమ్మల్ని మీరు ఒక్క పెన్‌స్ట్రోక్‌తో స్వార్థపరుల్నిగా చేశారు. మీ కథలో తండ్రి పాత్రకు అతని తోటివాళ్ళు డబ్బు సహాయమేకాక మాట సహాయం కూడా చెయ్యలేదనీ, అతను తన ఆస్తి సంతటినీ అమ్ముకోవటానికి వాళ్ళే కారణమనీ తేల్చారు. ఇంకా అతని కూతురుకు వచ్చిన మంచి సంబంధా లన్నింటినీ చెడగొట్టే వాళ్ళు అతని స్నేహితుల్లో ఉన్నారనీ రాశార.. మీ కథ వెళ్ళినంతమేరా ఈ ఆఫీసులో వాళ్ళమైన మేము పచ్చి స్వార్థపరుల మనే ముద్రతో పరిచయమై ఉంటాము. ఇది మీకేం న్యాయమో చెప్పండి.''

కావ్యకంఠం, ''వూఁ, చెప్పండి'' అని మాత్రం అని వూరుకున్నాడు.

''చెప్పటాని కే ముందండీ! ఈ వూరిపేరు వింతలపూడి అయితే మీరు దాన్ని చింతలపూడిగా మార్చారు. మన మానేజరుగారి పేరు అన్నామలై రావు అయితే దాన్ని సింహామలైరావు చేశారు. అక్కడితో వూరుకున్నా బాగుండిపోను. మేమంతా ఆ తండ్రి పాత్ర యొక్క అల్లుడికి వరకట్నం ప్రాముఖ్యం గురించి చెప్పి, ఆ కుర్రాడి చేత ఎక్కువ కట్నం అడిగించామని కూడా రాశారు. మేము వర కట్నాన్ని సమర్థిస్తున్నామా? తన అత్తమామల్ని బికారుల్ని చేసి వంట మనుషులుగా మార్చుకున్న ఆ అల్లుడు పచ్చి స్వార్థపరుడనీ, ఇటువంటి పచ్చి స్వార్థపరులోనే మన సమాజం పూర్తిగా నిండి పోయి గర్భవతి అయిన ఆడ తేలులాగా ఉందనీ, ఇటువంటి మన సమాజం దిక్కుమాలిన సమాజమనీ, దాన్ని గురించిన కథ కాబట్టి అది దిక్కుమాలిన కథ అయిందనీ మీరు ఆఖరి పేరాలో రాశారు. మన చుట్టూ అందరూ పచ్చి స్వార్థపరులే అయితే మీరు ట్రాన్స్‌ఫర్ లేకుండా ఈ వూళ్ళో ఉండే వారా? ఇక్కడ ఇల్లు కట్టుకోగలిగేవారా? అంత తేలిగ్గా మీ అమ్మాయికి పెళ్ళి చేసేవారా? ఆ మాట కొస్తే పైసా తీసుకోకుండా ఎంతోమందికి ప్రతి నెలా పెన్షన్లు తెప్పిస్తూ చెల్లిస్తున్న మీ మాటేమిటి? . . . . . . లోకమంతా పూర్తిగా చెడిపోయిందని రాయటం అన్యాయం, సార్!''

కత్తివాటుకు నెత్తురు చుక్కలేని మొహంతో కావ్యకంఠం అన్నాడు : ''అయామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ... నాలో ఏ కోశానా ఎవరి మీదా కోపంగానీ, ద్వేషంగానీ లేదు. నేను నా చుట్టూ ఉన్న సమాజం లోంచి నాకు తెలిసిన పరిస్థితుల్ని తీసుకున్నానే కాని లోతుకెళ్ళి మన సమాజాన్ని పరిశీలించలేదు. చాలామంది రాస్తున్నట్టే ఏదో రాసేసి పారెయ్యా లన్న తపనే కాని, దాని ప్రభావం ఎంత గాఢంగా ఉంటుందో నేను ఆలోచించలేదు. చెయ్యవలసిన మార్పుల్ని చేశాననే అనుకున్నాను. అవి అసహజంగా ఉన్నాయని ఇప్పుడు తెలుస్తూంది. కథ రాయటంలో ఇది నా మొదటి ప్రయత్నమవడం వల్ల ఇంతమందికి నేను కష్టం కలిగించి ఉండవచ్చు... మంచి కథ రాయటం ఇంత కష్టమా!... జరిగిందానికి చాలా విచారిస్తున్నాను. దయచేసి ఈ మాట మన మిత్రులతో చెప్పండి.''

సెక్రటరీ కాస్సేపు తలొంచుకుని కూర్చున్నాడు. చివరికి అన్నాడు : ''పార్టీ లేకుండా ఇది ఏదో ఇచ్చి రమ్మని మన మిత్రులు నన్ను పంపించారు. దీన్నిట్లా ఇవ్వటం వ్యక్తిగతంగా నా కిష్టం లేదు. మీ రన్న మాటలు వాళ్ళకు చెబుతాను. మిమ్మల్ని మళ్ళీ కలుస్తాను. నమస్తే.''

ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ కావ్యకంఠం అన్నాడు: ''రేపు సాయంత్రం టీకి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. తప్పకుండా రండి. వచ్చేటప్పుడు మన భూషణాన్ని కూడా తీసుకురండి. ప్లీజ్!''

''అట్లాగే, సార్'' — సెక్రటరీ వెళ్ళిపోయాడు తన సంచీతో

• • • •

చుట్టూ తన కుటుంబ సభ్యులు మగ్గురూ, సెక్రటరీ, భూషణం కూర్చోనుండగా వాళ్ళతో కలిసి టీ తాగుతూ కావ్యకంఠం అన్నాడు:

''ఫ్రెండ్స్! నా కథ వల్ల మీకు చాలా కష్టం కలిగిందని తెలిసి విచారిస్తున్నాను. నే నిప్పుడు ఏం చేస్తే మీ కష్టనష్టాల్ని పోగొట్టగలుగుతానో చెబితే సంతోషిస్తాను.''

శైవలిని నెమ్మదిగా అంది: ''నాన్నా, ఈ కాగితంలోని మాటర్‌ని నీ స్వహస్తంతో లెటర్‌పాడ్ మీద రాసి వీక్లీ ఎడిటర్‌కి పంపిస్తే బాగుంటుందని నా అభిప్రాయం.'' ఇట్లా అంటూ తన చేతి లోని కాగితాన్ని వరసగా అందరి చేతా చదివించింది. దాన్ని చదవగానే అందరి మొహాలూ వికసించటం మొదలుపెట్టాయి. ఆఖరుగా కావ్యకంఠం చేతిలో కొచ్చింది. అందులో ఇట్లా ఉంది:

''ఎడిటర్ మహాశయులకు —

నమస్సులు—ఈ వారం వీక్లీలో నా పేరుతో మీరు ప్రచురించిన 'దిక్కుమాలిన కథ' అనే కథను పంపింది నేను కాదు. ఈ విషయమై మీరు ఒక ప్రకటన ఇస్తే ధన్యుణ్ణి. ఆ కథ నా పేరుతో ఉన్నందువల్ల ఇంట్లోనూ, బయటా ఉన్న నా ఆప్తులంతా నాకు శత్రువులయ్యారు.

మీరు పంపిన వంద రూపాయల పారితోషికాన్ని తిప్పి మీకు పంపుతున్నాను, పోస్టు ఖర్చులు నేనే పెట్టుకొని. కాంప్లిమెంటరీ కాపీని కూడా రిజిస్టర్డు పోస్టులో పంపుతున్నాను. దయచేసి స్వీకరించండి.

ఇకముందు కూడా నా పేరుతో ఏ రచన వచ్చినా దాని బాధ్యత నా కేమాత్రం ఉండదని గ్రహించగోర్తాను.

మీ విధేయుడు...

—కంబుకంఠం కావ్యకంఠం.''

కావ్యకంఠం అందరివైపూ బేలగా చూశాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. అంతా అతనివైపే పరిశీలనగా చూస్తున్నారు. నెమ్మదిగా అతను టీపాయ్‌మీంచి తన లెటర్‌పాడ్ తీశాడు. అతని చెయ్యి వణుకుతూంది. నెమ్మదిగా ఆ ఉత్తరాన్నంతా కాపీ చేశాడు. సంతకం పెట్టాడు.

శుద్ధకీర్తి చటుక్కున తండ్రి చేతిలోంచి ఆ కాగితాన్ని లాక్కున్నాడు. దాన్ని వీక్లీలో పెట్టి, వీక్లీకి కాగితం చుట్టి, దాని మీద అడ్రసు రాశాడు. ఆ వీక్లీని, వంద కాగితాన్ని పట్టుకుని ఆదరా బాదరా పోస్టాఫీసుకి వెళ్ళిపోయాడు.

కావ్యకంఠాన్ని మినహాయించి అందరి మొహాల్లోనూ ఆనందం తాండవించింది! ★

